# అమ్మనమ్ముకుందాం

(సముద్రం అనే చీర కట్టుకొని అడవులు అనే నల్లని కుంతలాలు దువ్వుకొని సూర్యచంద్రులు అనే కన్నులతో చూస్తూ దిక్కులు అనే బాహువులు చాఁచి ఉగాది పండుగనాఁడు దీవిస్తూ ఉన్న భూదేవి ముందు, చినుఁగు పాతలు తలకు చుట్టుకొని ఉతుకుతున్న మదతలుతాల్చి వేపచువ్వలతో అల్లిన బుట్టలలో తవిఁదలూ, అలచందలూ, సజ్జలూ, అరిగెలూ, జొన్నలూ, నెవ్వరులూ, దోసలూ, కొతిమిరా, వేపపువ్వూ, కరివేపాకూ ఎత్తుకొని కర్షకజాతి ప్రవేశిస్తుంది. ఇల్లా ప్రవేశించి బుట్టలు దించి పాగలు తీసి మోఁకరించి) కర్షకజాతి – మా అమ్మకు దణ్ణాలు. మా తల్లికి దండాలు. భూదేవికి దండాలు. (అని లేచి తాము తెచ్చిన ధాన్యాదులు కానుక లిచ్చి నిలువఁబడును.)

భూదేవి : కలగాలి కలగాలి! నాయన్లారా! ఏఁటికి ఏఁడా దైంది మిమ్మల్ని చూసి, మీ రందఱూ ఆరోగ్యంగానూ, బలిష్ఠంగానూ ఉన్నారా! నాకు చెల్లెలున్నూ మీకు పింతర్లీనీ అయిన గోదేవియొక్క సంతానం బాగా వృద్ధిగా వుందా? మీ ఆలుబిడ్డ లందఱూ వాటితో ఆడుకుంటూ పాడుకుంటూ మీకు చేదోడుగా వున్నారా?

కర్షకజాతి : కనఁబడుతూనే ఉన్నాంగా మా తల్లీ! మీదయవల్ల మా పిన్నమ్మ బిడ్డలూ మేమూ బాగున్నాము. మా ఆలుబిడ్డలు మాకు సాయంచేస్తున్నారు. మాకు సాయ మేమిటి? వాళ్లపనులు వాళ్ళు చేసుకుపోతున్నారు. ఇదంతా మీ దీవన మహత్తు.

భూదేవి : నాయనా! మీ వాలకం కనఁబడుతూనే ఉంది. వంట చెరుకువంటి మీ శరీరాలూ, శతచ్ఛిద్రాలు గల మీపాగలూ, వీపులకు అంటుకోపోయిన పొట్టలూ ఇవన్నీ చూస్తూనేవున్నాను. ఇదంతా మేలే. మీరు బతకడంకోసం తింటున్నారుగాని తింటంకోసం బతకడం లేదు. మీరు అప్రయత్నంగా ద్వంద్వాలు జయించారు. మీరు నా పెద్దబిడ్డలు. మిమ్మలను ఎల్లా

బతికిస్తానా అనే నా ప్రాణం ఎప్పుడూ తపతపా కొట్టుకుంటూ ఉంటుంది. మీకేం కావాలో కోరుకోండి.

కర్షకజాతి : అమ్మా! నీసారం అంతా మాకిస్తూనే వున్నావు. మేమూ నిన్ను పీల్చి పిప్పి చేస్తూనే వున్నాము. అడగందే అమ్మయినా పెట్టదంటారు కాని నీవే కోరుకో మన్నావు. అమ్మా! మాకు తృప్తినిన్నీ ఇంత హరినామమునున్నూ ఇయ్యి!

భూదేవి : మీరు నా జ్యేష్ఠపుత్రులు కాఁబట్టి జన్మ తరించే కోరికలు రెండూ కోరారు. ఈ రెంటినీ మీరు మఱచినప్పుడల్లా పూరిస్తూ వుంటాను.

కర్షకజాతి : అమ్మా! ధన్యులమైనాం ధన్యులమైనాం. (అని మోఁకారించి లేస్తూ ఉండఁగా డప్పులు వినఁబడును) అమ్మా పెద్ద ఆసామీలు వస్తున్నారు. బక్కవాళ్లం నలిఁగిపోతాం, సెలవు.

భూదేవి : సమస్త సన్మంగళాని భవంతు.

(కర్షకులు నిష్క్రమిస్తారు. స్థూలకాయులు వికృతా కారులున్నూ అయిన పెద్ద ఆసాములు పొగాకూ, నల్లమందూ, సారా, దున్నలూ, గొర్రెలూ మొదలైనవానిని తెచ్చి కానుకలిచ్చి వంకరదణ్ణాలు పెట్టి నిలుచుంటారు.)

పెద్దలు : ఇదేం దీవన? మాకు ఆరోగ్యం లేక పోతేగా? మా బంగారుతల్లి ఏదో ఒఱగబెట్టుతుందని విలువగల కానుకలుగూడా తెచ్చి ముందర బెటితే బూరుగు చెట్టయిపోయిందేం? మేమేం బీదరైతులకు మల్లే దమ్మిడీ చెయ్యని కొత్తిమిరా దోసకాయలూ తైదలూ అరిగెలూ, - నవ్వువస్తూంది - అహ్హహ్హా- కరేపాకూ వేపపువ్వా కానుకలు తెచ్చామా?

కొందఱు : ఒరే ఈ సారా ఉందే దీనిచుక్క రూపాయ.

ఇంకొందఱు : ఈ పొగాకు తాడు మూఁడురూపాయలు.

మఱికొందఱు : ఈ గంజాయిప్రతి వీసె పదిహేను. ఈ పోతు వంద. గొర్రె రెండు పుంజీలు!

అందఱు : ఇదేం దీవనమ్మా? మా కారోగ్యం కలగాలీ?

భూదేవి : ఎంత తెలయనివాళ్లర్రా నాయనా! నన్ను కూడా ఇంత మాంసం తిని ఇంతకల్లు తాగి చుట్ట కాలుస్తూ కూచోమన్నారా నా తండ్రుల్లారా? మా కోడళ్ళు చాలామంది నేర్చుకున్నారుగాని -

పెద్దలు : ఇహ కోదండ్రికం ఒకటి తక్కువ.

భూదేవి : నాయనా కోడళ్లేకాదు కూఁతుళ్ళు కూడా. కోడంత్రికమే కాదు కూఁతుంత్రికం కూడా.

పెద్దలు : సరే ఇహ చెప్పు.

భూదేవి : నేర్చుకుపోయారుగాని ఇహ నేనే మిగిలి పోయానని మీరనుకుంటున్నారు. ఇటువంటి విషయాలలో మీకు పంక్తిభేదం లేదు. కాని అలవాటయి పోయిం తరువాత అమ్మకయినా ఊరికే ఇవ్వరు. నాకూ చాటుగా ఇంత అలవాటు చేస్తున్నారు. లేకపోతే నా కడుపున ఈ పొగాకూ, ఈ కల్లూ, ఈ గంజాయీ, ఈ నల్లమందూ ఎల్లా ఫలిస్తవి? ఈ కాఋ దినుసులన్నీ నా కలవాటయిన చోటు నల్లా పొడపుట్టి తిరగమాతిపోతున్నాను. ఆరోగ్యమూ అయుర్దాయమూ తగ్గుతున్నా ప్రాచీన కాలం దాన్ని కాఁబట్టి కొంచెం కొంచెం నిల్పవరించుకుంటున్నాను. మీ కసలే ఆయుర్దాయం తక్కువా; ఆశ ఎక్కువా. అందులో ప్రాణం బలి కోరే వాటిని వాడుకోడం ఇంకోళ్ళచేత వాడించడం వాటిని సాగుచెయ్యడం! అందుకని ఆ ఆపత్తు పోవాలని మీకు ఆరోగ్యం కలగాలని శ్రీరామరక్ష పెట్టానమ్మా!

పెద్దలు : మాకు వైద్యులున్నారు! మందు లున్నవి. ఆశీర్వచనాలకు బిడ్డలు పుటతారా?

భూదేవి : వాట్ల తాలూకు మత్తూ కనటూ పోగొట్టే మందొకటి ఉందంటే అది దీనికంటె విషం నాయనా! ముల్లు తీసి కొఱ్ఱడచుకుంటారా? మనుష్య ప్రకృతికి పుష్టి కలిగించే దినుసు పండించండి – తినండి – నాకింత పెట్టండి – ఆరోగ్యం పొందండి.

పెద్దలు : బక్క రైతు లందఱూ ఆ ఆరోగ్యాన్ని బాముకోనీ! మాకు కామం కావాలి; నిషా కావాలి, మాకు కర్చెక్కువ. కామాటం ఎక్కువ. సన్నపంచెలు కావాలి. జలతారు పాగాలు కావాలి. గింజలు పండిస్తే గోట్లోకి రావు. మా కింకా డబ్బొచ్చే నిషాదినుసు లేమైనా పండు!

భూదేవి : వద్దంటే ఎవఁడూ వినఁడు. వేదాలు 'వద్దు వద్దు' అని శాసనం చేస్తే ఎవఁడు విన్నాఁడు? సరే మీకే తెలుస్తుంది. లెండి. తెలిసివచ్చినప్పుడే దిద్దుకుంటారు.

పెద్దలు : ఆఁ. అల్లా రావాలి ధోరణి.

భూదేవి : మీ అభీష్టాలు సిద్ధించాలి.

పెద్దలు : భేష్ భేష్. అడగందే అమ్మయినా పెట్టదంటారే అది ఇదే.

భూదేవి : సరే పెట్టానుగా ఇంత విషం. కొడుకులకు విషం పెట్టే మహాతల్లిని నేనొక్కత్తెనే!

అందఱు : అదుగో మళ్లా తప్పుకోటానికి ఎత్తు.

భూదేవి : కాదు నాయనా కాదు. ముమ్మాటికి మీ అభీష్టాలు పొందండి. మీరు తెచ్చిన ఈ కానుక లన్నీ మీరే ఉపయోగించుకోండి. ఇవ్వేళ ఉగాదిపండుగక్కాదూ? మీ పండుగ నాకూ పండుగే కాని ఒక తేడా వుంది. మీరు పండుగనాఁడు పొట్టనించుకొని మైమరచేటంత ఉల్లాసంతో ఉంటారు. నేను ఉపాసం ఉండి నాలో నన్ను చూసుకుంటూ ఉంటాను.

కొందఱు : ముసలాళ్లూ ముక్కాళ్లూ అంతే. పండగంటే వీళ్ళకు ముద్దెందగ. పండగ వచ్చిందంటే జపమాలా వీళ్లూ తయారూ.

(పరిమళముతో కూడిన గాలి వస్తుంది. పెద్ద వెలుఁగు కనబడుతుంది. సన్నాయిపాట వినవస్తుంది. బొప్పరథాల (మోటార్ల) బూరాలు వినవస్తవి. పెద్దాసామీ లందఱూ చూస్తారు. చూచి) అమ్మోయ్ అమ్మా! రాజులు వస్తున్నారు. వచ్చేశారు.

కొందఱు : ఒరేయ్ మన్ని నలగదొక్కుతారు. పొగాకూ అవీ తీసుకోండ్రా!లేకపోతే వీళ్లు దివాణాల్లోకి పట్టిస్తారు. పోతుల్నీ గొఱ్ఱెల్నీ ముందర తోలండి!

(అందరూ సెలవైనా పుచ్చుకోకుండా ఎక్కడివాళ్ళక్కడ అయిపూ ఆనమాలూ లేకుండా వెళ్ళిపోతారు. అంతట ధనికజాతి అనఁగా పెద్దపెద్ద కోమట్లూ, రాజులూ, మహారాజులూ, మార్వాడీలూ, దళారులూ, నవుకరులూ వస్తారు. వచ్చి నమస్కారం చెయ్యటం అదోలోపం అనుకున్నట్టుగానూ అయినప్పటికీ తప్పనిసరి అయినట్టుగానూ భావిస్తూ ముందరికి వస్తారు.)

రాజులు : స్థిరకు –

నవుకరులు : దణ్ణాలు –

రాజులు : వసుధకు –

నవుకరులు : దణ్ణాలు.

రాజులు : రత్నగర్భకు –

నవుకరులు : దణ్ణాలు.

భూదేవి : మీలో మీకు ఐకమత్యం కలగాలి. మీ కాళ్లూ చేతులూ అయిన సేద్యగాళ్లవల్ల మీరున్నూ సేద్యగాళ్ల నోళ్లయిన మీవల్ల వాళ్లున్నూ అన్యోన్యం ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగి ఉండాలి.

రాజులు : వాళ్లకూ మాకూ కవుళ్లూ కదపాలూ ఇదివఱకే బిగిసి ఉన్నవి. వాళ్ల పంటవల్ల మా కడుపేం నిండుతుంది?

భూదేవి : నిజమే. దాదుల పాలవల్ల పెరిఁగినవాళ్లకు తల్లి గుణాలెల్లా వస్తవి? అయినా ఎందుకు రావాలి నాయనా నేను మట్టిని.

(రాజులు తమతమ ఒళ్ళు చూచుకుంటారు. నవుకరులు వారి ఒళ్ళు దులుపుతారు.)

భూదేవి : (నవ్వి) దేవతాంశ లెంత మీలో ఉన్నా మీరు మట్టిబిడ్డలే. మట్టికొడుకుల కడుపులు మట్టిలో పుట్టిన గింజలతోనే పెరగాలి. ఆ గింజలు పండించేవాళ్లు మీ అన్నలు. వాళ్లు దైత్యులూ మీరు ఆదితేయులూ కారు.

రాజులు : అబ్బా! పొంతమాటలు చెప్పకు. మాలో మేం చూసుకుంటాం. పండుగ గదా అని వచ్చాం. అమ్మా! మాకే, బంగారం కావాలి.

భూదేవి : ఇంకా యెక్కడుంది? కోలారు గనులిచ్చానుగా! ఆ గునపాలపోటు ఇంకా నాకు తగులుతూనే ఉంది. మీకు వినఁబడడం లేదూ? దానివల్లే నాకు పెద్ద కంపం గలిగింది.

మహారాజులు : (తనలో) రత్నపుగనులు ఇదివఱకే ఉజాడు చేశాం. హీరాలు పద్మరాగాలు మరకతాలూ సీమకు వెళ్లినవి. మా పాగాలమీఁదివి బిళోరీసామాను. చేతఁగాక చూసుకోలేక బంగారపుగనులు పడమటివారి చేతులలో పెట్టాం. ఇంకా అడిగితే బాగుండదు. (పైకి) అమ్మా! పోనీ.

భూదేవి : ఇనుక మింకా ఇచ్చేదా?

రాజులు : ఆ యినపగజ్జెలతల్లి మాకొద్దు. తాతా వారికే ఇయ్యి.

భూదేవి : ఏది ఎవరి కిస్తే ఎవరు నిలుపుకున్నారు? వారి కిచ్చిన దంతా సీమకు సలాము చేస్తున్నది. రాఁ గోరుతుందికదా అని రాగి ఇస్తే తెల్లవాళ్లపరం చేశారు. సినా రేకు, సీసం, ఇత్తడి, వెండి, వల్ ఫ్రమ్, ఇవన్నీ బ్రహ్మదేశంకదా అని బర్మావారి కిస్తే వారు ఇంగ్లాండుపరం చేశారు. మాంగోనిజ్, క్రోమూ ఇస్తే దక్కించుకోలేక పోయారు. సరే మీకు అభ్రక మియ్యనా?

రాజులు : పేరు గొప్పా ఊరు దిబ్బా. కాకిబంగారమా మేము పుచ్చుకునేది?

మార్వాడీలు : (తమలో) ఇదివఱకే ఇంగ్లీషువారి వశం చేశాము. ఇపుడు పుచ్చుకొని ఈ కాస్తా వాళ్ల కంటఁగట్టి డబ్బు చేసుకుందాం. (పైకి) మీకొద్దు లెండి. మేం తీసుకుంటాం. అమ్మా! మా కియ్యి!

భూదేవి : తథాస్తు.

మార్వాడీలు : సెలవు.

భూదేవి : మంచిది నాయనా మంచిది.

(మారువాడీలు వెళతారు)

(రాజులను చూచి) మీకు కిరసనాలూ కిరసనాల వంటి తైలమూ -

రాజులు : అత్తరనా పన్నీరనా? (ముక్కు మూసి కొని) కంపు పాడుకంపు.

భూదేవి : అవన్నీ లోఁగడే విదేశీయుల చేతులలో ఉన్నవి లెండి. పోనీ సున్నమూ సీమెంటూ -

కోమట్లు : మంచివన్నీ లాఁతివారు లాగేశారు.

భూదేవి : పోనీ చీనామట్టి గిరిమట్టి -

రాజులు : అమ్మా! నీకు కోపం వస్తే వచ్చిందికాని మమ్మల్ని తాపీవాళ్లు కమ్మన్నావా? రాచవాళ్లను కన్న పోలెమే నీలో కనఁబడలేదు.

భూదేవి : ఆహాహా నా కేం కోపం? పోనీ నాలో నల్లమసి - మాణిక్యాలు ఉన్నవి. తీసుకుపోయినవారు తీసుకుపోఁగా ఇంకా మీ కని దాఁచాను. ఆ మసిమాణిక్యాలకు నిప్పంటిస్తే రవ్వలవుతవి. చేతులు మసి అవుతయ్యని అనుకోకండి! అదే జగత్తు నంతా నడిపిస్తుంది.

రాజులు : ఛీఛీ బొగ్గులూ బూడిదా - ఇదా మా ఖర్మ! నీ వెక్కడి తల్లివి మే మెక్కడి బిడ్డలం? తల్లికి చిన్నసంతానం మీఁద ప్రేమెక్కువంటారు ఏదీ? ఉన్నదంతా పెద్దవాళ్ళకే పెట్టు!

భూదేవి : లేదు నాయనా నన్ను బద్దలుగా పగలుకొట్టి ఉన్నదంతా తీసుకోండి! మీకోసమే నేను బతికున్నాను.

రాజులు : నిజమే. నిన్నడగటమే బుద్ధితక్కువ. నీవు ఉన్న మేలిమంతా గుండెలలో దాఁచుకున్నావు. నీ గుండెలు కోసి చూస్తాం.

భూదేవి : ఉంటే బిడ్డలకు లేదనేది తల్లికాదు. మఱచారుకాని లోఁగడే నాగుండెలు కోశారు. మీకు ప్రాప్తం లేకపోయిందనే నా విచారంకాని నన్ను కోశారని కాదు.

కొందఱు : (అపవారించి - కొందఱతో) అవునయ్యా అవును మనం ఇహ అమ్మను అమ్ముదాం.

దళారులు : (తమలో) మనం జాగర్తగా ఆలకించాలి.

అందఱు : (ఒకరి మొగ మొకరు చాచుకొని) అమ్ముదాం. అమ్ముదాం.

కొందఱు : ఆ పనిమాత్రం ఇదివఱకు జరక్కపోతేగా!

భూదేవి : నాయనా మిగిలిందికూడా అమ్ముకోండి.

అందఱు : అమ్ముకుంటాం, అమ్ముకుంటాం.

దళారులు : (మహారాజులు మొదలగు ధనికజాతితో) అతలికి వెళ్లి బేరం ఫైసలా చేసుకుందాం రండి.

అందఱు : ఇక్కడే కానీండి.

దళారులు : (రహస్యంగా) మీ అమ్మ ఎదుట కాదు అతల.

అందఱు : కౌన్సిళ్ళలోనా?

దళారులు : రండి రండి.

భూదేవి : సర్వేజనా స్సుఖినో భవన్తు.

(నిష్క్రమణము)

• ప్రబుద్ధాంధ్ర, మార్చి - *1935* •